ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు 3**
ఆదివారం 1 సెప్టెంబరు 2024

రోడ్డు గుంతలమయం.. ప్రయాణం ప్రమాదకరం 6లో..
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి 6లో..

స్వచ్ఛ బడుల వైపు అడుగులు



Celebrating Swachhata Pakhwada
1st to 15th September

● నేటి నుంచి 'స్వచ్ఛ పక్వాడ' ● పక్షం రోజులు కొనసాగనున్న కార్యక్రమం ● జిల్లాలో వెయ్యికి పైగా పాఠశాలల్లో నిర్వహణ

జగిత్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి వ్యాధులు ప్రబలుతుండడం, పరిశుభ్రత పాటించడం వల్ల అనారోగ్యం ధరి చేర కుండా కాపాడుకోవడం అంశాలపై అవగా హన కల్పించేందుకు విద్యాశాఖ ప్రయత్నాలు చేస్తోంది. పాఠశాలల్లో స్వచ్ఛతను కాపాడడానికి కసరత్తులను జరుపుతోంది. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

స్వచ్ఛ పక్వాడ పేరిట సెప్టెంబరు 1వ తేదీ నుంచి పక్షం రోజులు రోజుకో కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాయి. ప్రతీ రోజు ప్రత్యేక కార్యక్రమం చేపట్టేందుకు పాఠశాల విద్యా శాఖ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. పరిసరాలు పరిశుభ్రంగా లేనిచోట సీజనల్ వ్యాధులు ఎక్కు వగా ప్రబలు తున్నందున పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయాలన్న లక్ష్యంతో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం అమలు చేయనున్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ స్వచ్ఛత పక్షోత్సవాలను స్వచ్ఛపక్వాడ పేరిట నిర్వహించనుంది.

నేటి నుంచి ప్రారంభం...

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుం చి 15వ తేదీ వరకు ప్రతీరోజు స్వచ్ఛ పక్వాడలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు సమాజంపై బాధ్యత స్వచ్ఛత పై అవగాహన కల్పించడం, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు కార్యచరణ రూపొందించారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులకు సమాచారమందించి సన్నద్ధం చేశారు.

స్వచ్ఛత పక్షోత్సవాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అవగాహన పెరిగి పరిసరాల పరి శుభ్రతపై వ్యక్తిగత శుభ్రతతో పాటు సమాజానికి మేలు జరిగే అవకాశం ఉంది. కార్యక్రమంపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఆసక్తి, అభిరుచి పెంపొందిం చేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవతో ఈ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

జిల్లాలో మొత్తం 1,117 వివిధ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 360 హైస్కూల్‌లు, పీఎస్‌లు 531, యూపీఎస్‌లు 226లు, కేజీబీవీలు, గురుకుల, సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి.

కార్యక్రమాలు ఇలా....

స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెంపొందించడం, సమాజ భాగస్వామ్యం కల్పించడం మొక్కలు నాటి ప్రకృతి చైతన్యాన్ని కలగజేయడం, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం అనే ప్రధాన లక్ష్యాలుగా ఈ పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాల స్థాయి పోటీలు కూడా నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు.

తేదీల వారీగా షెడ్యూల్ ఇలా..

- సెప్టెంబర్ 1వ తేదీన...ఉపాధ్యాయులు విద్యా ర్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తారు.
- 2,3వ తేదీల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, చైతన్యం కల్పిస్తారు.
- 4, 5వ తేదీల్లో ...పాఠశాలను సమాజానికి చేరువ చేయడం, స్థానిక ప్రజలు, విద్యావేత్తలతో మమేకం చేస్తూ వారికి కూడా స్వచ్ఛత గురించి తెలియజేస్తారు.
- 6వ తేదీన, హరిత దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో విద్యా ర్థులతో మొక్కలు నాటిస్తారు.
- 7వ తేదీ, 8వ తేదీల్లో స్వచ్ఛత భాగస్వామ్యంలో భాగంగా విద్యా ర్థులకు వ్యాస రచన, ఉపన్యాస, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తారు.
- 9, 10వ తేదీల్లో చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మధ్యాహ్న భోజన సమయంలో కడుక్కోవడం, పరిశుభ్రత ప్రాధాన్యత వివరిస్తారు.
- 11వ తేదీన వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తారు.
- 12వ తేదీన సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థి పాత్రను గుర్తింపజేస్తారు. స్వచ్ఛతపై పాఠశాల స్థాయిలో ఎగ్జిబిష న్ నిర్వహిస్తారు.
- 13, 14వ తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళిక కార్యచరణ విధానాన్ని విద్యార్థులతో సిద్ధం చేయిస్తారు. స్వచ్ఛత ప్రాముఖ్యతను నిర్దేశిస్తారు.
- 15వ తేదీన 15 రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తారు.

పటిష్ఠంగా అమలు....
జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తాం. 15 రోజుల పాటు రోజుకో అంశాన్ని తీసుకొని విద్యార్థులలో చైతన్య కార్య క్రమాలు అవగాహన చేపట్టాలి. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. విద్యార్థులకు సమాజానికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమం అమలు చేస్తోంది.

సభ్యుల సహకారంతో వార్డు అభివృద్ధిపై దృష్టి
మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య



సమావేశానికి హాజరైన సభ్యులు

కోరుట్ల, ఆగస్టు 31 : సభ్యుల సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్ అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 37 అంశాలతో కూడిన ఎజెండా అంశాలలో పాలక వర్గ సభ్యులు 36 అంశాలను ఏకగ్రీవ తీర్మానం ద్వార ఆమోదం తెలిపారు. 1 అంశంపై సభ్యులు అభ్యతరం తెలుపడంతో అశం తీర్మాణం జరగలేదని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. వర్షా కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి అంటు వ్యాధుల నివారణపై అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ బట్టు తిరపతి, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాస్, టీపీవో ప్రవీణ్ కుమార్, జేఏవో శివకుమార్, రమ్య, ఎఈ లక్ష్మీ, అరుణ్ కుమార్, కౌన్సిలర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే
జగిత్యాల ఆర్డీవో మదుసూధన్‌గౌడ్



విచారిస్తున్న ఆర్డీవో మధుసూధన్ గౌడ్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 31: వయోవృద్ధులైన తల్లితండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, వృద్ధాప్యంలో వారిని విస్మరిస్తే జైలుకు వెళ్లడం తప్పదని జగిత్యాల ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ మదుసూదన్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలైన కేసుల్లో బాధితుల కుటుంబ సభ్యులు ఆర్డీవో ఎదుట విచారణకు హాజరయ్యారు. ట్రిబ్యునల్ ఎదుట బాధిత వయోవృద్ధులు తమగోడును వినిపించగా, వారి కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల పక్షాన సీనియర్ సిటిజన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ వాదనలు వినిపించారు. ఆర్డీవో ఫిర్యాదుదారులు, వారి కుటుంబీకుల వాంగ్మూలం, సాక్ష్యాధారాలను పరిశీలించారు. తల్లిదండ్రులను విస్మరిస్తే 6 నెలల జైలుశిక్షతో పాటు, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదుదారుల కుటుంబాలకు ఆర్డీవో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ విచారణ కార్యక్రమంలో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ పద్మజ, ఎఫ్ఆర్‌వో కొండయ్యతో పాటు సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ , బాధితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గొల్లపల్లి, ఆగస్టు 31: జిల్లా నూతన కార్యవర్గాన్ని గొల్లపల్లి మండల కేంద్రంలో శనివారం ఎన్నుకున్నారు. జాతీయ వాలీబాల్ క్రీడా కారుడు కన్నా రమేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పెద్దపల్లి వాలీ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌ రవ అధ్య క్షుడిగా రషీద్, అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గు రజాల బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షునిగా సత్యనారాయణలను ఎ న్నుకున్నారు. అ నంతరం సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు శ్యాంసుందర్ రెడ్డి కుటుంబాన్ని సీనియర్ క్రీడాకారులు పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ధర్మపురి మున్సిపల్ సమావేశం

ధర్మపురి, ఆగస్టు, 31 : ధర్మపురి పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం చైర్ పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో మొత్తం 15 అంశాలకు ఆమోదం లభించింది. ప్రధానంగా సమావేశంలో నూతన స్వచ్ఛ ఆటో కొనుగోలు, కార్యాలయం ముందు శిథిలావస్థలో ఉన్న గదిని కూల్చి వేసి నూతన గది నిర్మాణం కోసం చర్చించారు. ఆధాయ వ్యయాలు వివరాలు, ఇతర బిల్లులు చెల్లింపు చేసేందుకు మొత్తం 14 అంశాలకు గాను ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి, గంగాధర్, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, టౌన్ ప్లానింగ్ అధికారి, శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టరు గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, ఆగస్టు 31 : భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు రానున్న మూడు రోజుల్లో అతి భారీ వర్షాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు దృష్ట్యా వాగులు పొంగిపొర్లి చెరువులు, కుంటల వద్దకు పిల్లలు, యువత, జాలర్లు సెల్ఫీ కోసం, గోదావరివాగులు, చెరువులవైపు వెళ్లొద్దన్నారు. ప్రమాదకర చెరువుల వద్ద కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం 18004257620 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ, అదనపుకలెక్టర్లు, ఆర్డీవోలు, సంబంధించిన జిల్లా అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

సంకల్పం, సాధనతోనే సాధికారత సాధ్యం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 31: సాధించాలనే తపన, ధృడ సంకల్పం, అందుకు అవసరమైన సాధనతోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని జిల్లా సాధికారిత టీం సభ్యులు అన్నారు. పట్టణంలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో పిల్లలు, మహిళ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100డేస్ స్పెషల్ అవేర్‌నెస్ ఫర్ సంకల్ప్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలకు అవగాహన కల్పించారు. లింగ సమానత్వంతో పాటు, భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్, సాధికారత బృందం సభ్యులు గౌతమి, స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి
కలెక్టర్ సత్యప్రసాద్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, ఆగస్టు 31 జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులందరూ ఆస్పత్రిలో అందుబాటులో ఉండి వైద్యం అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓపీని చెక్ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. డెంగ్యూతో అడ్మిట్ అయిన రోగులను, వారికి అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యుల పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తర్వాత స్టాక్ రిజిష్టర్ ప్రకారం మందులు నిల్వలు ఉన్నాయా లేదా అని చూశారు. జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ రఘువరన్, ఆర్ఎంవో రామకృష్ణ, డాక్టర్ శశి కాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ ..

మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని మోడల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మో డల్ స్కూల్‌కు వెళ్లే దారిలో రెండు రోడ్లు తెగిపోయినందున రోడ్డు నిర్మా ణానికి ప్రణాళికలు సిద్ధం చేసి ఈజీఎస్ కింద నిధులను మంజూరు చేయాలన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం నివేదికలు తయారు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లు శానిటేషన్ చేయించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో రఘువరణ్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్



నేర సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్, ఆగస్టు 31 : మహిళల సంబంధిత నేరాలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. శనివారం జగిత్యాల సబ్‌డివి జన్ పోలీస్ అధికారులతో క్రైమ్ మీటింగ్ నిర్వ హించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ ఏకీకృత సేవల కోసం ప్రవేశపెట్టిన ఫంక్షన్ వర్టికల్స్‌ను పటిష్ఠంగా అమలుపరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. జిల్లాకు వర్షప్రభావం దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, డీసీఆర్‌బి, ఆర్‌బి, ఎస్‌బి, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ ఆలీఖాన్, రఫీక్ ఖాన్, సీఐలు వేణుగోపాల్, కృష్ణరెడ్డి, రవి, రాంనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

భద్రత కోసమే గణేష్ మండపాల ఆన్‌లైన్ నమోదు

భద్రత, బందోబస్తు కోసమే గణేష్ మండపాల ఆన్‌లైన్ నమోదు విధానాన్ని రూపొందించామని, మండప నిర్వా హకులు పోలీస్‌శాఖవారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకొని పోలీస్‌వారికి సహకరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ కోరారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ పోలీస్ శాఖవారు రూపొందించిన ఆన్‌లైన్ విధానం కేవలం మండపం నిర్వహణ, సమాచారం కోసమే అన్నారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటుకు సులువుగా ఉంటుందన్నారు. గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయుటకోసం ముందస్తుగా పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే 100 కాల్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి పదవీ విరమణ

జగిత్యాలరూరల్, ఆగస్టు 31 : జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో పీజీ హెచ్ఎంగా పనిచేస్తున్న మామిడాల లక్ష్మీనారాయణ పదవీవిరమణ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో గాయత్రి, పీఆర్‌టీయూ టీఎస్ జగి త్యాల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అమర్నాథ్‌రెడ్డి, ఆనంద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహేష్, రాష్ట్రకార్యదర్శి మహేష్, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధనప్రసాద్, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు చందన, పట్టణ అధ్యక్షులు శ్రీదేవి, శశికళ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో

కూలిన ప్రాచీన పాండురంగ దేవాలయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: నగరంలోని పాతబజార్ 49వ డివిజన్ పరిధిలోని అతి ప్రాచీన శ్రీపాండురంగ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కురుస్తున్న వర్షాలతో స్లాబ్ పైకప్పు, గోడలు కూలి పోయాయి. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ చల్లస్వరూప రాణి హరిశంకర్ స్థానిక కార్పొరేటర్ కమల్ జిత్‌కౌర్ సోహెన్‌సింగ్‌తో కలిసి శనివారం ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంపై కప్పు, గోడలు కూలినందున భక్తులు, ప్రజలు ఎవరు కూడా ఆలయంలోకి వెళ్ళవద్దని సూచించారు. కూలిపోయిన గోడలు, పైకప్పును తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మతో, భూ యజమానితో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించి నిర్మాణాన్ని ప్రారంభించానలి డిప్యూటీ మేయర్ సూచించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి భూమి పూజ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ కుమార్ నగరంలో కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయించి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. శనివారం 29వ డివిజన్ కాపువాడలో నిర్మించనున్న కాపువాడ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, 13వ డివిజన్ పెద్దమ్మ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీతో కలిసి కమ్యూనిటీ భవనాలకు శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాపువాడలో శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్‌కుమార్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా

దశల వారీగా ఆందోళనలు

సుభాష్‌నగర్, ఆగస్టు 31: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్‌రావు, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్, కరీంనగర్ అధ్యక్షుడు బద్దం డానియల్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక కార్ఖానగడ్డలో గల అంబేద్కర్ మెమోరియల్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, అనంతరం వినతిపత్రాల అందచేత, 11న ఎమ్మెల్యే, ఎంపీ, చైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 16న కలెక్టరేట్ ఎదుట నిరసనలు, 27న చలో హైదరాబాద్, అసెంబ్లీ ముట్టడి ఉంటుందని తెలిపారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, గంగాధర్, దశరథం, ఎడ్ల రామకిషన్, టి ఓంప్రకాశ్, గంబీరావు పేట అంజయ్య, దొంత రాజేశం, కాంపెల్లి రమణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ పీఆర్వో అశోక్, సూపరింటెండెంట్ తిరుపతిరావులు, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పరిశీలించారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు భీమేశ్వర స్వామి వారి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు నువ్వుల నూనేతో అభిషేకం నిర్వహించి స్వామి వారికి నల్లబట్టను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ..

రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ అల్లి శం కర్, ముఖ్య అర్చకులు అప్పాల కరుణాకర్, స్కావెంజర్ జాక్పాల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఆవరణలో ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉద్యోగుల కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, శ్రీనివాసు పదవీవిరమణ పొందిన వారిని సత్కరించారు. అప్పాల కరుణాకర్ సుధ దంపతులు నిర్వ హించిన వీడ్కోలు సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై సన్మానించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	15,689	4,825	80.5	60.823
ఎల్లంపల్లి	14,302	6,580	20.175	18.063
మిడ్ మానేరు	10,450	19,550	27.54	14.98
ఎల్‌ఎండీ	4.100	253	24.034	12.923

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు


తాడూరి రాజమౌళి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 31: వివాహానికి వెళ్తూ ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి రాజమౌళి(60) తన సోదరుడి కుమారుడి వివాహం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేశారు. వివాహానికి హాజరయ్యేందుకు శనివారం తెల్లవారుజామున గ్రామం నుంచి తాడూరి గంగయ్య మరి కొందరితో కలిసి ఆటోలో బయల్దేరి వెళ్లారు. ఆటో సింగాపూర్ శివారులోని వెన్నంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తాడూరి రాజమౌళి తలకు బలమైన గాయం కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న తాడూరి హనుమయ్య, తాడూరి ధర్మయ్య, అక్షయ తిరుపతి, తాడూరి గంగయ్య, పల్లె కొమురయ్య, పల్లె హర్షవర్ధన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాడూరి రాజమౌళిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ విచారం వ్యక్తం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్


కరీంనగర్ సర్కిల్ అధికారుల సమావేశంలో ఎస్ఈ

గణేశ్‌నగర్, ఆగస్టు 31: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. శనివారం కరీంనగర్ సర్కిల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై క్రమ పద్ధతిలో ఉంచాలన్నారు. బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలన్నారు. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వలన వినియోగదారులు విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లకు తేడా తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు వర్క్స్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-40 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈనెల 17నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి లబ్ధి పొందని వినియోగ దారులు దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని తెలిపారు.

● వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ సూచించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని అన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై ఆరవేయకూడదని సూచించారు.

టేకు చెట్ల నరికివేత


నరికివేసిన టేకు చెట్టు

వీర్నపల్లి: ఆగస్టు 31: మండలంలోని అల్మాస్‌పూర్ అటవీ సెక్షన్ పరిధిలోని కంచర్ల శివారులోని లచ్చక్క గుడ్డంలో ఏపుగా పెరిగిన టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అటవీ ప్రాంతంలోనే సైజులుగా మార్చి రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు సొంత చేలలో చెట్లు నరికితే కేసులు పెడుతున్న అధికారులు అటవీ సంపదను నాశనం చేస్తున్న పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతపై ఎఫ్ఎస్ఓ పద్మలతను వివరణ కోరగా ప్రతిరోజు అటవీ ప్రాంతంలో నిఘా పెడు తున్నామని, చెట్లను నరుకుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.


అటవీప్రాంతంలో నరికివేసిన టేకు చెట్లు

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ● ఎనుమాముల మార్కెట్‌లో అధికారులతో సమీక్ష

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31: వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలందించమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏనుమాముల, జనగామ, జమ్మికుంట, మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు ఏనుమాముల మార్కెట్‌లోని పలు సమస్యలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మార్కెటింగ్ శాఖలో ముఖ్యంగా మార్కెట్లలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రస్తుతం ఉన్న సాంకేతికతను జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న వేబ్రిడ్జిలను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. లక్ష్మీపురం, మార్కెట్‌తో పాటు ఏనుమాముల మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెట్‌లో దడువాయిలు వాడే పీవోఎస్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఒక్కో మార్కెట్ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజువసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్- 2 కార్యదర్శులు అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్, జనగామ, జమ్మికుంట, ఖమ్మం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి లక్ష్మీబాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో మార్కెట్ కమిటీ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, జన్ను భాస్కర్, లాషరీఫ్, పి.అశోక్, జీవన్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 31: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గీతాభవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీసీ సమగ్ర కులగణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీల కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కుల గణన ప్రారంభించే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాలను ప్రశ్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాజు రాకేష్‌చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు సంపత్ గౌడ్, ఎడ్ల సురేందర్, బ్రహ్మచారి, నలవెలి రవి, బండారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్య చికెన్ వండలేదని ఆత్మహత్య


కిశోర్(ఫైల్)

సుల్తానాబాద్, ఆగస్టు 31: చికెన్ తీసుకుని ఇంటికి వచ్చిన భర్త వండమని భార్యకు చెప్పాడు. ఇంటి పనిలో బిజీగా ఉన్న భార్య కాసేపు ఆగిన తర్వాత వండుతానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాల గ్రామానికి చెందిన పూసాల కిశోర్(33) కార్పెంటర్. తాగుడుకు బానిసై పనిలేకుండా తిరుగుతూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్లి వచ్చిన డబ్బును తాగుడుకే ఖర్చు చేస్తున్నాడు. దాంతో ఇంట్లో పూట గడవక భార్య సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తోంది. ఆ వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం రాత్రి ఇంటికి చికెన్‌తో వచ్చిన కిశోర్ తన భార్యను కూర వండమని చెప్పాడు. కొంత సేపాగి వండుతానని భార్య చెప్పడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: తనకు రావాల్సిన వాటా భూమి విషయంలో సోదరుడితో వివాదం విషయంలో మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొప్పుల చంద్రకాంద్(45) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. వల్లంపహాడ్‌కు చెందిన కొప్పుల చంద్రకాంత్ భూమి విషయంలో సోదరుడితో గొడవపడి ఈ నెల 24న వెంకటేశ్వర ఆలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 31: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన మొల్లంకుల బాలయ్య ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని శనివారం కలెక్టర్ రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న బాలయ్య అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు ఏప్రిల్ నెలలో దాడి చేశామని తెలిపారు. బాలయ్య వద్ద ప్రామిసరీ నోట్స్, చెక్కులు, డాక్యుమెంట్లు లభించగా కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎదుట హాజరుపర్చగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్, ఆగస్టు 31: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగలిస్తుండగా సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టుకున్నారు. బస్టాండ్‌లోని 14వ ప్లాట్‌ఫాం వద్ద జి.శ్రీనివాస్ అనే ప్రయాణికుడు బస్‌లోకి ఎక్కుతుండగా శనివారం చెన్నూర్‌కు చెందిన ఎం.సతీష్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి యత్నించాడు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, కొమురయ్య, కవితలు పట్టుకున్నారు. అనంతరం సతీష్‌ను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ● మిడ్ మానేరు నిర్వాసితులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 31: మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితల సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్‌పల్లి, చింతలఠాణ, గుర్రంవానిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో శనివారం సహావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమా నికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏళ్లు నిండిన వారికి పరిహా రం, ఆల యాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, శ్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముంపు గ్రామాల పరిధి లో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూము లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశిం చా రు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మానవతా దృక్ప థంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం వచ్చేలా కృషి చేస్తాన ని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయి స్తామని, అర్హులైన ప్రతీఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగం

● ముగ్గురు అధికారుల అరెస్టు

వేములవాడ రూరల్, ఆగస్టు 31: మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు నిందుతులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాలకు సంబంధించి బకాయిల అవకతవకలున్నట్లు గమనించిన యాజమాన్యం చీఫ్ అకౌంట్స్ అధికారికి విచారణ చేయమని జూలై నెలలో ఆదేశాలిచ్చింది. విచారణ చేపట్టిన అధికారి సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వేములవాడ డీసీఎంఎస్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 76,77,325 రూపాయల అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్ తన భార్య పేరుతో ఎరువుల షాప్ కోసం లైసెన్స్ తీసుకున్నాడు. మార్క్‌ఫెడ్‌కు అడ్వాన్స్ చెల్లించి ఎరువులను తీసుకోవాల్సి ఉండగా అకౌంటెంట్ భాస్కర్ సాయంతో నగదు చెల్లించినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. నకిలీ పత్రాలతో జిల్లా మేనేజర్ దివ్యభారతికి బకాయిలు లేనట్లుగా చూపించి ఎరువులను పొంది బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని 76,77,325 రూపాయలు సొంతానికి వాడుకున్నారు. విచారణ అనంతరం మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్‌ను,అకౌంటెంట్ భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు. అనంతరం రమేష్, భాస్కర్‌తో పాటు విధుల్లో బాధ్యతారహితంగా వ్యవహరించిన జిల్లా మేనేజర్ దివ్యభారతిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మార్క్‌ఫెడ్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, అకౌంటెంట్ భాస్కర్, జిల్లా మేనేజర్ దివ్యభారతిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

6న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లా హన్మకొండలో 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అసోసియేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికె ట్‌ను వెంట తీసుకొని సంఘ సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు ఫోన్. 9441925807 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: భారత దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు అప్పన్నగారి వెంకట్రావ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 3, 4 తేదీలో జరిగే మోగా ఇంపాక్ట్ ప్రోగ్రాం వాల్‌పోస్టర్‌ను ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు జీవితం, సమాజంపై అవగాహన లేకపోవడంతోనే దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై అవగాహణ కల్పించడానికి కరీంనగర్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాంపై ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్ : 9676004408 నెంబర్‌కు ఫోన్ చేసి తీర్చుకోవచ్చునని అన్నారు. సమావేశంలో ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి సిరిసిల్ల బాలకృష్ణ, అధ్యక్షుడు కోడం బాలకిషన్ ఉన్నారు.

ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద, వెంకంపేట వద్ద రోడ్లపై డీజేలు పెట్టుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న డీజే యజమానులైన పి. పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై వేర్వేరుగా కేసు నమోదు చేశామన్నారు. రెండు డీజేలను సీజ్‌చేశామన్నారు. డీజే యజమానులను అరెస్ట్‌చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అయినప్పటికీ పోలీసుల సూచనలు బేఖాతరు చేయడం వల్ల కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ మండపాల వద్ద పోలీసు అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు రాత్రి 10గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేల వలన చిన్నపిల్లలు, విద్యార్థుల చదువునకు , వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని డయల్ 100కు కాల్స్ రావడంతో వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేశ్ మండపాల్లో, శోభాయాత్రలోనూ డీజేలు ఏర్పరిచి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఎవరైనా డీజేలు ఏర్పాటుచేస్తే యజమానులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఆగస్టు 31:మండలంలోని నర్మాల మానేరు క్యాంపు మైసమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన దేవేందర్‌గౌడ్ అనే వ్యక్తి శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌గౌడ్ గంభీరావుపేట మండలం శ్రీగాధలోని తన అత్తగారింటికి వెళ్లే క్రమంలో నర్మాల మానేరు ప్రాజెక్టు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో దేవేందర్‌గౌడ్ ముఖం, కాళ్లు చేతులతో పాటు తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దేవేందర్‌గౌడ్ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మల్యాల, ఆగస్టు 31: దిగువ కొండగట్టులో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఇతర సిబ్బంది టిఫిన్ సెంటర్లు, హోటళ్లను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో కుళ్లిన వస్తువులు, కాలం చెల్లిన తిండి పదార్థాలను గుర్తించి వాటిని పడేశారు. పరిశుభ్రతతో శుచి, శుభ్రతతో నాణ్యత గల వాటినే ప్రజలకు అందించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో తనిఖీల సమయంలోనూ పాడైన వస్తువులు లభించగా తీరు మారకపోవడంతో నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు లైసెన్స్‌లు తీసుకోవాలని, లైసెన్స్‌లు ఉన్న వారు వారం రోజుల్లోగా రెన్యూవల్ చేసుకోవాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 31: జమ్మికుంట రైల్వేస్టేషన్ నుంచి బల్లార్షకు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. జమ్మికుంట పట్టణానికి చెందిన యండి శమీమ్ అనే మహిళ బల్లార్షకు గంజాయి తరలించేందుకు రైల్వేస్టేషన్ చేరుకుంది. సమాచారం అందుకున్న అబ్కారీ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 490గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, తహశీల్దార్ ఎదుట హాజరు పరిచారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో అబ్కారీ సీఐ మాధవీలత, ఎస్సై సౌమ్య, కానిస్టేబుళ్లు అయిలయ్య, పెద్దన్న, భాస్కర్, మహేష్, పద్మావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ

శంకరపట్నం, ఆగస్టు 31: శంకర పట్నం మండలం మొలంగూర్ పరిధిలోని గుడాటిపల్లి గ్రామంలో ఇంటి తాళం పగల గొట్టి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రం సంజీవరెడ్డి భార్యతో కలిసి ఈ నెల 30న సాయంత్రం తన కుమారుడి కొడుకు పుట్టిన రోజు ఫంక్షన్‌కు కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పోలీసుల అదుపులో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి

కోరుట్ల, ఆగస్టు 31: పట్టణానికి చెందిన ఓ రియల్టర్‌ను ఫోన్‌లో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల నుంచి పట్టణంలో ప్రకాశం రోడ్డుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాలుపడుతున్న విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పథకం ప్రకారం పట్టుకున్నారు. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారికి వారం రోజుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నాడు. మొదట రూ. 50లక్షలు కావాలని ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సదరు వ్యాపారి తనవద్ద అంత డబ్బులేదని ఫోన్ పెట్టేసాడు. మళ్లీ కొత్త నంబర్లతో ఫోన్ చేసి రూ. 5లక్షలైనా ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో గంట తరువాత ఫోన్ చేయండి అని చెప్పి వ్యాపారి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. రియల్టర్‌కు గంట తరువాత మళ్లీ ఫోన్ రావడంతో పోలీసుల సూచన మేరకు సదరు వ్యక్తిని రైల్వేస్టేషన్ వద్దకు రావాలని సూచించాడు. బెదిరింపులకు పాలుపడిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు పథకం ప్రకారం ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు వ్యక్తి 6 నెలల క్రితం పోలీసుల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తన వాహనంలో పిస్తోల్‌తో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజుల క్రితం జైల్ నుంచి వచ్చిన సదరు వ్యక్తి మరో కేసులో ఇరుక్కుని పోలీసులకు చిక్కడంతో చర్చనీయాశంగా మారింది.

పాపన్న గుట్టలను పరిశీలించిన అధికారులు


సర్వాయి పాపన్న గుట్టల వద్ద అధికారులు

సైదాపూర్, ఆగస్టు 31: సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట శివారులో ఉన్న సర్వాయి పాపన్న గుట్టలు, ఆ ప్రాంతాన్ని టూరిస్టు స్పాట్‌గా ఏర్పాటు చేయుటకు టూరిజం అధికారులు డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి హుజూరాబాద్ డీఐ పాయబ్ అలీ, సైదాపూర్ తహసీల్దార్ దూలం మంజులలు పర్యటించి పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు నిధులు విడుదల చేయడంతో ముందుగా ఆ నిధులతో ఏఏ పనులు చేపట్టాలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, సర్వాయర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

కొడిమ్యాల, ఆగస్టు 31 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారికి సమీపంలో మండలంలోని పూడూర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ఏటీఎంను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంతో తనిఖీలు చేశారు.

లారీ కింద పడి యువకుడి మృతి

చొప్పదండి, ఆగస్టు 31: మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన దాసరి సంజీవ్ (28) లారి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ అనూష కథనం మేరకు సంజీవ్ తన బైక్‌పై వెళ్తుండగా బైక్ పాడైపోవడంతో చొప్పదండి శివారులోని పెట్రోల్ పంపు దగ్గర ఆగాడు. వర్షం పడుతుండడంతో అక్కడ ఆగి ఉన్న లారీ వెనుకాల కూర్చున్నాడు. లారీని డ్రైవర్ స్టార్ట్ చేయగా సంజీవ్ కాలుపై నుంచి టైరువెళ్లడంతో కుడికాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంజీవ్ మృతి చెందాడు.

రోడ్డు గుంతలమయం.. ప్రయాణం ప్రమాదకరం..



కొడిమ్యాలలో గుంతలమయంగా మారిన రహదారి

కొడిమ్యాల, ఆగస్టు 31: మండల కేంద్రంలోని సీసీ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. మండల కేంద్రంలో అంగడి బజారు నుంచి బస్టాండ్ సమీపం వరకు ఉన్న సీసీ రోడ్డు అడుగడుగున గుంతలమయమైంది. వర్షం కురిసిన తర్వాత గుంతల్లో నీరు చేరటంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. 1996-97లో అప్పటి సర్పంచు వడ్లకొండ నాగలక్ష్మి హయాంలో నిర్మించిన సీసీ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం చేయటం ఇబ్బందిగా మారినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ సీసీ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన ఎవరికి రాక పోవటం శోచనీయమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న కొంత మంది ఇళ్ల యజమానులు నల్లా కనెక్షన్ల కోసం సీసీ రోడ్డును తవ్వటం, తర్వాత నామమాత్రం పూడ్చి వేయటంతోనె గుంతలమయంగా తయారైందని పలువురు తెలిపారు. ప్రతి ఎన్నికలు ముందు అభ్యర్థులుగా పోటీలో ఉన్న వారు మాత్రం సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామని హామీ ఇవ్వటం విజయం సాధించిన తర్వాత మరిచి పోవటం మామూలైపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

బోగ రాకేష్, మండల బీజేపీ నాయకుడు

మండల కేంద్రంలోని అంగడి బజారు నుంచి చిలుక వాగు వరకు నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలి. గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న ప్రమాదాలు కూడా చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 31: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మంద రాకేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ బకాయిల విడుదల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థిలోకానికి ఈ ప్రభుత్వంలో కూడా నిరాశే మిగిలిందన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు సైతం ప్రభుత్వం చెల్లించే స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ పైనే ఆధారపడి కళాశాలల నిర్వహణ చేస్తు న్నాయని, అవి రాకపోవడంతో నిర్వహణ భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలన్నారు. సంఘ బాధ్యులు మహేష్, రాజ్‌కుమార్, వేణు, ఎండీ హమీద్ ఉన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా మాధవీలత

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 31 : మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా మాధవిలత బాధ్య తలు స్వీకరించారు. శనివారం పాఠశాలలో నూతన ప్రిన్సి పాల్‌గా బాధ్యతలు స్వీకరించిన మాధవిలతకు తోటి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి స్వాగతించారు. గురుకుల పాఠశాలల్లో గత కొన్ని రోజుల క్రితం అనుమానాస్పదంగా ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో పాటు నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జరిగిన ఘటనలకు కారణంతో అప్పటి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులకు గురికాకుండా అప్పటి నుంచి వసతులు కల్పించడానికి ప్రభుత్వం నిధులు మం జూరు చేసి పనులు చేపట్టడంతో సేలవులు ప్రకటించారు. నందిమేడారంలో విధులు నిర్వహిస్తున్న మాధవిలతను పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం ప్రకటించడంతో బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్

కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి, ఆగస్టు 31(ఇబ్రహీంపట్నం): కాంగ్రెస్ పార్టీ జెండా పేద ప్రజలకు అండగా ఉంటుందని పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని 7వ వార్డు, పాత బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిత్యం పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాంప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హత కలిగినవారికి దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 31: నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో నిర్మాణం చేపట్టిన 4వేల డబుల్ బెడ్ రూం ఇళ్లలో అర్హత కలిగిన నిరుపేదలకు అవకాశం ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇండ్లు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించలేని అర్హులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోనేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం లేక చేసిన వారి దరఖాస్తు అనుమతించక పోవడంతో వారు నిరాశకు గురవుతున్నారని, అర్హత కలిగి, గతంలో లబ్ధిదారులుగా ఎంపిక కానటువంటి వారికి ప్రస్తుతం కేటాయింపునకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం మంజూరుకు ఆన్‌లైన్‌లో గానీ, లేదా ఆఫ్‌లైన్‌లో రెవెన్యూ అధికారులకు ప్రత్యక్షంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

అంజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం

రూ. 4లక్షలు అందించిన ఖమ్మం జిల్లా భక్తులు



ఆలయ అధికారులకు చెక్కు అందజేస్తున్న భక్తులు

మల్యాల, ఆగస్టు 31: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఖమ్మంకు చెందిన భక్తులు రూ.4 లక్షల విరాళం అందించారు. వల్లబనేని నిఖిల్, సురేష్ అనే భక్తులు విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్‌కు అందజేశారు. ఈ అన్నదానం పథకానికే కాకుండా ఆలయంలో మరిన్ని క్యూలైన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా భక్తులు తెలిపారు. రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు అందజేత



ఆత్మకూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న దాత జరుపుల మహేందర్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 31 : మండలంలోని ఆత్మనగర్ గ్రామానికి చెందిన ఏరోనాటికల్ ఇంజనీరింగ్ జరుపుల మహేందర్ ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. శనివారం మండలంలోని ఆత్మనగర్, ఆత్మకూర్, రాజేశ్వర్‌రావుపేట గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత డబ్బులతో సమకూర్చిన కంప్యూటర్లు, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల కిట్‌లను ఉచితంగా అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఎన్ఆర్ఐలు, ఉన్నత స్థానంలో వారు, ఇతర దాతలు స్వచ్ఛందంగా గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు జరుపుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చిలివేరి విజయ్‌గౌడ్, నాయకులు కేసి రెడ్డి నవీన్ రెడ్డి, బండ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాలు ఖాళీ చేయాలి

రాయికల్, ఆగస్టు 31: భారీ వర్షాలు పడుతున్నందున రాయికల్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేయాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేసి కూల్చివేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ఉండేందుకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కావున శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయాలన్నారు. ఈ విషయాన్ని రాయికల్ పట్టణ ప్రజలు గమనించాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు



పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న చైర్మన్

రాయికల్, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని, అవసరమైన చోట జేసీబీతో తొల గించడం, వార్డుల వారీగా డ్రై డే నిర్వహించాలని పేర్కొన్నారు. వినాయక నవరాత్రులు ప్రారంభమవుతున్న దృష్ట్యా మండపాల నిర్వాహకులు పారిశుధ్యం పాటించాలని, నిమజ్జనం కోసం మైతాపూర్ రోడ్డులోని బ్రిడ్జి వద్ద క్రేన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్, భద్రతా ఏర్పాట్ల గురించి చర్చించారు. వర్షాకాలం పలు వార్డుల్లో వీధి దీపాల సమస్య ఉందని, వాటిని పరిష్కరించాలని అన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతి గురించి కౌన్సిల్ సభ్యులు అడుగగా, ఈ పనుల గురించి ఎమ్మెల్యేతో మాట్లాడామని, త్వరలోనే ప్రారంభిస్తామని చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా 16 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు యూనిఫాంలు అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు మారంపెల్లి సాయి కుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, వల్లకొండ మహేష్, కల్లెడ సునీత, మ్యాకల కాంతారావు, మ్యాకల అనురాధ, కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ మెరాజొద్దీన్, మేనేజర్ వెంకటి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్గాంలో అంబేద్కర్ బోర్డు తొలగింపు

జగిత్యాలరూరల్, ఆగస్టు 31(ఎప్) : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో ఓ వర్గానికి కేటాయించిన భూమిలో ఏర్పాటు చేసుకున్న అంబేద్కర్ బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తొలగించారని మరో వర్గానికి చెందినవారు ఆందోళన చేపట్టారు. దీంతో అంతర్గాం గ్రామంలో శనివారం ఉద్రికత్త వాతావరణం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వర్గానికి చెందినవారికి అంతర్గాం గ్రామశివారులో ఓ భూమిని కొన్ని సంవత్సరాలుగా తమ అవసరాలకోసం వినియోగిస్తున్నారు. అప్పటినుంచి సదరు భూమిని సదరు వర్గానికి చెందిన కులస్థులు వినియోగించుకుంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న కొంత మంది వ్యక్తులు సదరుభూమిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ బోర్డును శనివారం తొలగించగా ఉద్రిక్తతకు దారితీసింది. ఈవిషయమై జగిత్యాల రూరల్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోర్డును తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

వెల్గటూర్, ఆగస్టు 31: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి, డీపీవో రఘువరన్ పేర్కొన్నారు. శనివారం రాజారాంపల్లిలో ఓ ఫంక్షన్ హాల్‌లో వెల్గటూర్ ఎంపీడీవో రవీంధర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, నాయకులు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీడీవోగా రవీంధర్‌రెడ్డి మండలంలో చేసిన సేవలు కొనియాడారు. ఆయన శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎజెండాలోని రెండు అంశాలను తొలగించాలి

కోరుట్ల, ఆగస్టు 31 : మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఏర్పాటు చేసిన ఏజెండాలోని రెండు అంశాలను తొలగించాలని బీజేపీ కౌన్సిలర్లు పెండం గణేష్, మ్యాడవేణి నరేష్ శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ తిరుపతికి వినతిని అందించారు. సమావేశానికి మందు కౌన్సిలర్లు వినతిని అందించారు. ఆర్బనైజబుల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్పు కోసం, అమృత్ 2.0 స్కీం మాస్టర్ ప్లాన్ పట్టణ శివారులోని ఎఖీన్‌పూర్ కలుపుకోని సమర్పించబడిన జీఐఎస్ బెస్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించుటకు ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలుపుమని తెలిపినట్లు వారు తెలిపారు. పట్టణంలో చాల చోట్ల కమర్షియల్ ఇండస్ట్రియల్ జోన్‌లు ఉన్నవి వాటిలో తెలియక నిరుపేదలు ప్లాట్‌లు కొనుగోలు చేసుకోని రెసిడెన్సియల్ ఇళ్ల అనుమతి కోసం అప్లికేషన్ చేసుకోగా ఇండస్ట్రీయల్, కమర్షియల్ జోన్ అని మున్సిపల్ నుంచి రెసిడెన్షియల్ పర్మిషన్ల ఇవ్వడం లేదని ఈ విషయం దృష్టిలో పెటుకోని నిరుపేదలకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ల్ కోరారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

పెగడపల్లి, ఆగస్టు 31 : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి పిలుపునిచ్చారు.

శనివారం పెగడపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆన్‌లైన్ ద్వారా నడుస్తున్న ఎన్నిక ప్రక్రియను మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్‌తో కలసి విజయలక్ష్మి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ యువజన విభాగం ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వాలు పెద్ద ఎత్తున చేయించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, విజయభాస్కర్, వినూత్నరెడ్డి, రాజేష్, అనీల్ గౌడ్, విష్ణు, కిషన్ పాల్గొన్నారు.

సాయి జీనియస్‌లో రెడ్ డే వేడుకలు



ఎరుపు రంగు దుస్తులతో చిన్నారులు

కోరుట్ల, ఆగస్టు 31 : పట్టణంలోని సాయి జీనియస్ పాఠశాలలో విద్యార్థులు రెడ్ డే వేడుక లను నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులను ధరించి వేడుకలను నిర్వహించారు. దానిమ్మ, చెర్రి, స్ట్రాబేరీ పండ్లు, కూరగాయలు టమాటో, బీట్‌రూట్‌లలో లభించే విటమిన్స్, మినరల్, ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్‌ల గురించి పిల్లలకు వివరించారు. ప్రతి దినం ఎదైనా పండు తిని ఆర్యోగం కాపాడు కోవాలని పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ విద్యార్థులకు సూచించారు. పువ్వులు గులాబీ, మందార, ఎర్ర రంగులో ఉన్న పోస్టు బాక్స్, ఫైర్ ఇంజన్‌ల వాటి ప్రాముఖ్యతలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో విద్యార్థులు ఎర్రదుస్తులు ధరించడంతో స్కూల్ ప్రాంగణం ఎర్ర రంగుగా మారింది. ప్రిన్సిపాల్ చౌకి సుధాలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

రుణమాఫీ ఆన్‌లైన్ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

● **జిల్లా వ్యవసాయాధికారిణి వాణి**

కథలాపూర్, ఆగస్టు 31 : రేషన్‌కార్డు లేని రు. 2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి వాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌నమోదును పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన విధంగా రైతులకు సంబంధించిన కుటుంబ వివరాలు ఆధార్ కార్డులతో అనుసంధానం చేస్తూ నమోదు జరగాలన్నారు. అదేవిధంగా రైతులు పలు సందేహాలను అడగగా వాటిని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు శేఖర్, సుష్మశ్రీ, హరీశ్, మౌనిక, సంధ్యారాణి ఉన్నారు.

కోరుట్ల రూరల్ : రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణను మండల వ్యవసాయ అధికారి నిర్ణయిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారిని వాణి అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో జరుగుతున్న రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని సందర్శించి వ్యవసాయ ఏవో, ఏఈవోలకు పలు సూచించారు. రైతు కుటుంబ నమోదు వివరాలను పరిశీలించిన జిల్లా అదికారి స్వయంగా పలు రైతుల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, ఏఈవోలు నరేష్, పేమీనా, శ్రీహరి, రాఘవేంద్రలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రమాదకరమని తెలిసినా పట్టించుకోరా..?

కంచె లేకుండా ఇండ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 31: జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామశివారులో జగిత్యాల నుంచి రంగపేట వెళ్లే రహదారి పక్కనే ఇండ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో పక్కనే ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలం కావడంతో ప్రమాదతీవ్రత మరి ఎక్కువగా ఉందని వర్షం పడినప్పుడు, ఈదురు గాలులు వీచినప్పుడు ట్రాన్స్ ఫార్మర్ నుంచి మినుగురులు వచ్చి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు, కాలనీ వాసులు వాపోతున్నారు. ట్రాన్స్ ఫార్మర్‌ను ఆను కొని కిరాణం షాపు ఉంది. ఇక్కడికి నిత్యం గ్రామస్థులు కిరాణ సామగ్రి కోసం పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా వస్తుంటారు. ఆ సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇండ్ల మధ్యనే ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాద కరం గామారిన ట్రాన్స్‌పార్మర్‌ను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హన్మాజీపేటలో కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రిన్సిపాల్‌కు ఘనంగా సన్మానం

మల్యాల, ఆగస్టు 31: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్ శనివారం పదవి విరమణ పొందగా నాయకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంకిత భావంతో విధులు నిర్వహించారని ఫలితాల సాధనలో గురుకుల పాఠశాల, కళాశాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ నాయకులు సాగర్‌రావు, జనగాం శ్రీనివాస్, ఆనందరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు, గురుకులం అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

రాయికల్, ఆగస్టు 31: రాయికల్ తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. తహసీల్దార్ ఖయ్యూం విద్యార్థులకు ధరణి పోర్టల్, పహానీ గురించి, రిజిస్ట్రేషన్ విధానం గురించి అవగాహన కల్పించారు. ఆర్ఐ పద్మయ్య విద్యార్థులకు కుల, ఆదాయ, జనన, మరణ, నివాస సర్టిఫికెట్ల గురించి, మ్యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేష్, ఆర్ఐలు పద్మయ్య, దేవదాస్, సర్వేయర్ నరేందర్ పాల్గొన్నారు.

జువ్వాడి పరామర్శ

మెట్‌పల్లి, ఆగస్టు 31(ఇబ్రహీంపట్నం):పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పదోన్నతి పొందిన ఉద్యోగికి సన్మానం

మెట్‌పల్లి, ఆగస్టు 31(ఇబ్రహీంపట్నం): పట్టణానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ నుంచి తహసీల్దార్‌గా పదోన్నతి సాధించిన సందర్భంగా పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షులు పసునూరి రాజారాం, ఉపాధ్యక్షులు రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులు సాయన్న, వేణు, ఆనంద్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

కథలాపూర్, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం మండల స్థాయి గ్రామీణ క్రీడలను ఎంఈవో ఆనందరావు, ఎస్సై నవీన్ ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి అండర్ 14, 17 విభాగంలో బాలురు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు హాజరయ్యారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

పెగడపల్లి, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి బాలికలు, బాలుర అండర్ 14, 17 ఆటల పోటీలు శనివారంతో ముగిసాయి. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు క్రీడాకారులు పాల్గొనగా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపికలు నిర్వహించినట్లు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఎంఈవో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రమేష్, పీఈటీలు కళ్యాణ్, కార్తీక్, సురేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏవోకు సన్మానం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 31 : మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దీపికను బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని రైతువేదికలో అధికారులు రైతు రుణమాఫీ పథకంలో భాగంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వేను పరిశీలించారు. గ్రామానికి వచ్చిన ఏవోను రైతులు, నాయకులతో కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నల్ల సంజీవ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొండగట్టులో శ్రావణ సందడి

మల్యాల, ఆగస్టు 31: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో సందడిగా మారింది. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్ పర్యవేక్షించారు. ఆంజనేయస్వామిని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటి వైస్ చాన్సలర్ కార్యాలయ పీఆర్‌వో టి.కిషన్‌రావు దర్శించుకున్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

కోరుట్ల, ఆగస్టు 31 : విద్యార్థినులు ఆరోగ్య విషయంలో తగిన జాగత్తలు తీసుకోవాలని సమాజ కర్త, మోటివేటర్ ముంబాయి వాసి నిర్మల జోగు అన్నారు. శనివారం పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో కోరుట్ల కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఋతుస్రావం అయినపుడు తీసుకేనే జాగత్తలను వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థినులు అడిగి సమస్యలను నివృత్తం చేసారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంట్ పోతని ప్రవీణ్ కుమార్, క్లబ్ అధ్యక్షురాలు శ్రీలత, కళాశాల ప్రిన్సిపల్ పోతని నవీన్ కుమార్, వైస్ పిన్సిపల్ లక్ష్మి భవాని క్లబ్ సభ్యులు ప్రేమలతతో పాటు పలువురు పాల్గొన్నారు.